ప్రజాశక్తి
శుక్రవారం 30 ఆగస్టు 2024
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





మెడికల్ కళాశాలకు పీజీ సీట్లు కేటాయించాలి : వేమిరెడ్డి



ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాకు ప్రతిష్ఠాత్మకమైన ఎసి సుబ్బారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ విభాగాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్‌కు సంబంధించి కొత్తగా సీట్లు కేటాయించాలని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నేషనల్ మెడికల్ కమిషన్ ఛైర్మన్ బి.ఎన్ గంగాధర్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం ఢిల్లీలోని నేషనల్ మెడికల్ కమిషన్ కార్యాలయంలోని ఛైర్మన్ గంగాధర్‌ను కలిసి ఎపి ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ నెల్లూరు కమిటీ తరపున కోరారు. 2024-25 సంవత్సరానికి నెల్లూరు మెడికల్ కాలేజీలో ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీకి సంబంధించి పీజీ సీట్లు కేటాయించాలని పేర్కొన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన గంగాధర్ సీట్ల కేటాయింపుపై పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినట్లు ఎంపి వేమిరెడ్డి తెలిపారు.

వైసిపికి 'బీద' రాజీనామా..!

టిడిపిలో చేరికకు సన్నాహాలు - పార్టీ నేతలు మౌనం



బీద మస్తాన్‌రావు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

వైసిపి రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు ఆపార్టీకి రాజీనామా చేశారు. గత ఎన్నికల సమయంలో టిడిపి నుంచి వైసిపిలోకి వెళ్లిన ఆయన ఇప్పుడు ఆపార్టీకి రాజీనామా చేసి మళ్లీ టిడిపి వైపు చూస్తున్నారు. ఈ పరిణామాల పట్ల టిడిపి నేతలు పెద్దగా స్పదించడం లేదు. ఇప్పటికే టిడిపిలో వలస నేతలతో కిటకిటలాడుతోంది. ఇతర పార్టీల నుంచి నేతలు ఇక్కడకు వస్తే తమకు అన్యాయం జరుగుతుందని టిడిపి నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీద మస్తాన్‌రావు రాకతో కావలి ప్రాంతంలో టిడిపికి కొంత ఉపయోగమేనని చెప్పొచ్చు. బీద మస్తాన్‌రావు గతంలో టిడిపి తరుపున కావలి నుంచి ఎంఎల్‌ఎగా విజయం సాధించారు. ఎంఎల్‌ఎగా, ఎంపిగా ఒడిపోయారు. గతంలో కావలి నుంచి టిడిపి నుంచి పోటీచేసిన ఆయన పార్టీ ఓడిపోవడంతో పోలీసు కేసులు, దాడులకు భయపడి వైసిపిలో చేరారు. ఆపార్టీ ఇటీవల ఆయనకు రాజ్యసభ టికెట్ కేటాయించింది. బీద మస్తాన్‌రావు టిడిపిని వీడి వెళ్లినా ఆయన సోదరులు బీద రవిచంద్ర మాత్రం టిడిపితోనే నడిచారు. ఒకప్పుడు కలిసి మెలిసి తిరిగిన సోదరులు , రాజకీయ విబేధాలతో వ్యాపార లావాదేవీలను తెంచుకున్నట్లు తెలిసింది. కావలి నియోజకవర్గంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీద మస్తాన్‌రావు, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి కలిసి ప్రచారం చేయగా, బీద రవిచంద్ర ఒక్కరే ఎంఎల్‌ఎ అభ్యర్థిని గెలిపించుకునేందుకు ప్రచారం చేశారు. బీద సోదరులు రెండు పార్టీల తరపున పోటీ చేయడంతో వారి అనుచరులు సైతం విడిపోయారు. ఇప్పుడు బీద మస్తాన్‌రావు టిడిపిలోకి వస్తుండడంతో బీద సోదరులు హవా మళ్లీ కావలిలో ఉంటుందని భావిస్తున్నారు.



గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం : కలెక్టర్

నెల్లూరు :గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ఒ.ఆనంద్ పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలో ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. నగరంలోని ఎసి సుబ్బారెడ్డి స్టేడియం నుంచి కరెంట్ ఆఫీస్ సెంటర్ వరకు క్రీడాకా రులు, విద్యార్థులతో కలిసి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ చేపట్టారు. తొలుత ఎసి సుబ్బారెడ్డి స్టేడియం ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. తదుపరి వివిధ ఆటల పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు.జిల్లా క్రీడా అభివద్ధి అధికారి యతిరాజ్ , జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి పెంచలయ్య, జిల్లా బిసి సంక్షేమ అధికారి వెంకటయ్య , జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి గురు ప్రసాద్ పాల్గొన్నారు.

విషజ్వరాల నివారణకు చర్యలు తీసుకోవాలి

జిల్లా వైద్యాధికారికి ప్రజా సంఘాలు వినతి



డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు : నగరంలో ప్రజలను పట్టిపీడిస్తున్న విష జ్వరాలను నివారణకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని అవసరమైతే హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని డివైఎఫ్ఐ, ఐద్వా సంఘాల నాయకులు కోరారు. గురువారం స్థానిక సంతపేట ప్రాంతంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట డివైఎఫ్ఐ, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం నాయకులు జిల్లా వైద్యాధికారి డాక్టరు ఎం.పెంచలయ్య, జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మను కలిసి సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అనంతరం మీడియాతో డివైఎఫ్ఐ, ఐద్వా సంఘాల నాయకులు మాట్లాడారు. నగరంలో గత నెల రోజులుగా అనేక ప్రాంతాలలో విష జ్వరాలు నగరవాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని ఈ విష జ్వరాలపైన ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. నగర జనాభా కి తగ్గట్టుగా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడం వల్ల పారిశుద్ధ్యం లోపించే సైడ్ కాలువల్లో చెత్తాచెదారాలు పెరిగిపోయే దోమలు ఎక్కువ అవ్వడం వల్ల ఆ దోమలు కుట్టిన ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మున్సిపల్ అధికారులు సైడ్ కాలువల్లో ఆయిల్ బాల్స్ దంగుచి చేపలు పిల్లలు ఫాగింగ్ చేయడం బ్రైటెక్స్ ఆయిల్ స్ప్రే చేయడం లాంటి దోమల నివారణ చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. జ్వరాల భారిన పడి చికిత్సల నిమిత్తం ప్రయివేట్ వైద్యశాలలకు వెళ్తున్న ప్రజలను దోచుకుంటున్న ఆస్పత్రులు, ల్యాబ్‌లపైనా నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. డివైఎఫ్ఐ ఐద్వా నాయకులు పాల్గొన్నారు.డివైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ, ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్ బి, నగర్ కార్యదర్శి పద్మ ,డివైఎఫ్ఐ నాయకులు తిరుపతి, జగదీష్ ,సురేంద్ర ,శేఖర్ ,పవన్ ,సుబ్బారాయుడు, షాహినా, మల్లేశ్వరి, రమణమ్మ ఉన్నారు.

ఇదేనా ప్రభుత్వ ఇసుక విధానం



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి 'కాకాణి'

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే ఇసుక ఉచితంగా ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఇసుకను ప్రియం చేశారని, భవన నిర్మాణ కార్మికులకు పనులేకుండా చేశారని, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఆపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక విధానంలోని కొండ నాలుకను మందేస్తే, ఉన్న నాలుక పోయినట్లు పరిస్థితి తయారైందన్నారు. కేవలం ట్రాన్స్‌పోర్టు, లోడింగ్ ఛార్జీలు మాత్రమే తీసుకుంటామని ప్రకటించారన్నారు. ఇప్పుడు పరిస్థితి అత్యంత దారుణంగా మారిందని విమర్శించారు. పేదలకు ఇసుక సరఫరాలో ప్రభుత్వం విఫలమైందని, భవన నిర్మాణ కార్మికులు పనులు దొరకని పరిస్థితి వచ్చిదన్నారు. ప్రభుత్వ ఇసుక విధానంపై ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఎవరు వెళ్లినా పార్టీకి నష్టం లేదు..

వైసిపి నుంచి కొందరు ఎంపి, ఎంఎల్‌సీలు టిడిపి కొనుగోలు చేస్తుందని, గతంలోనూ ఇలాంటి చర్యలే ఆపార్టీ సిద్ధమైందన్నారు. టిడిపి కొనుగోలు చేయడానికి తమ పార్టీ నేతలను సంతలో కొన్నట్లు కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు టిక్కెట్ ఇచ్చి గౌరవించిన పార్టీని మోసం చేసి వెళ్లడం సరికాదన్నారు. టిడిపి కుట్రలను తిప్పికొడతామని, ఎవరు పార్టీని వీడినా తమ పార్టీకి వచ్చిన నష్టం ఏమీ లేదన్నారు. జిల్లాలో పార్టీ నేతలు, కార్యకర్తలను కాపాడ ుకుంటామన్నారు.

తైక్వాండో విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరులో బుధవారం జరిగిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీలలో కందుకూరు బిఅర్ ఆక్స్ ఫర్డ్ కాలేజి విద్యార్థులైన వె.భాస్కర రెడ్డి, వె. భవ్యశ్రీ బంగారు పతకాలు సాధించారు. వీరు ఈ నెల 31,సెప్టెంబర్ 1వ తేదీలలో తిరుపతి లో జరుగబోయే ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి పోటీలకు వె భవ్య శ్రీ ఎంపికైందని జిల్లా తైక్వాండో కార్యదర్శి మాస్టర్ అబ్దుల్ సలాం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను విద్యా సంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి బాల భాస్కర రావు, బి.నరేంద్ర బాబు లు ప్రత్యేకంగా అభినందించారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన

కందుకూరు : మండలంలోని మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ లకు కాలానుగుణంగా వచ్చే సీజనల్ వ్యాధుల నివారణపై పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ రాకేష్ కుమార్ అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాజేష్ కుమార్ మాట్లాడారు. ఆర్ఎంపిలు హాజరయ్యారు.

సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి : సిపిఐ

నెల్లూరు : నగరంలోని ప్రధాన ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణంలో సిసి కెమోరాలు ఏర్పాటు చేయాలని సిపిఐ నగర కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆర్‌టిసి పి ఓ రమణను కలిసిన సిపిఐ నాయకులు వినతిపత్రం అందజేశారు.సిపిఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ మాట్లాడుతూ ఆర్‌టిసి లో ఎన్నో సమస్యలు ఉన్నాయన్నారు. పారిశుద్ధ్యం లోపించిందన్నారు.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షానవాజ్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు అజీజ్ అహ్మద్ పాల్గొన్నారు

ఎస్ఐ బాజీబాబుకు సన్మానం

ప్రజాశక్తి. - లింగసముద్రం : లింగసముద్రం ఎస్ఐగా పని చేస్తూ బదిలీపై నెల్లూరుకి వెళ్లిన జీబాబును పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. లింగసముద్రం ఎస్ఐగా ఏడాది పాటు సేవలందించిన ఆయన బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో ఎస్ఐ ను స్టేషన్‌లో గురువారం సిబ్బంది సన్మానించారు. ఎస్ఐ బాజీ బాబు మాట్లాడారు.

స్కిల్ కోర్సులు ప్రారంభం

ప్రజాశక్తి-కందుకూరు : స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ ఆంధ్రప్రదేశ్ మంగళగిరి వారి సౌజన్యంతో స్కిల్ డెవలప్మెంట్ లో భాగంగా యాడ్ ఆన్ స్కిల్ కోర్స్ ప్రారంభిస్తున్నట్లు కందుకూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కే మస్తానయ్య తెలిపారు. స్కిల్ కోర్సులను ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్ వారికి ఎలక్ట్రికల్ కాడ్ ,పి ఎల్ సి కోర్సులను సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచ్ వారికి రివిట్ ఆర్కిటెక్చర్ కోర్సును సెప్టెంబర్ రెండో తేదీ నుండి కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభిస్తున్నట్లు మస్తానయ్య తెలిపారు.

1న ఆదివాసీల ప్రాంతీయ సదస్సు

నెల్లూరు : స్థానిక టౌన్‌హాల్‌లో సెప్టెంబరు 1వ తేదీన ఆదివాసి పోరాటాలకు సంఘీభావంగా కోస్తాంధ్ర ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన సంఘం అధ్యక్షులు జి.మాల్యాద్రి పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక కో-కన్వీనర్ బాబు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు : నేత్రదానాన్ని ప్రోత్సహిద్దామని డాక్టర్ శర్వాణి అన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, బ్లాక్ బోర్డ్ మిత్రమండలి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం, వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ సమావేశ మందిరము నందు 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ శర్వాణి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ రామ ప్రసాద్ మాట్లాడారు. జిల్లా పి.హెచ్.పి గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్, నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు ఉన్నారు.

ఆహారం పంపిణీ

కందుకూరు : ఒలేటివారిపాలెం ఎలక్ట్రికల్ ఏఈ తాటికొండ మధుబాబు ధర్మపత్ని రాధిక ల 25వ పెళ్లిరోజు సందర్భంగా కందుకూరు కోవూరు రోడ్డు నందు ఉన్న స్వర్ణ స్వయంకషి మానసిక దివ్యాంగుల పాఠశాలలో దివ్యాంగులకు ఆహారం పంపిణీ చేశారు. ప్రకాశం జిల్లా వాసవి సేవాదళ్ కోశాధికారి ఇన్నమూరి శ్రీనివాసులు, ప్రకాశం జిల్లా యువజన సంఘం ఉపాధ్యక్షులుచీదెండ్ల కృష్ణ ఉన్నారు.

లింగసముద్రం ఎస్ఐగా మహమ్మద్ సుభాని



మహ్మద్ సుభాని
ఎస్ఐ, లింగసముద్రం

ప్రజాశక్తి - లింగసముద్రం : లింగసముద్రం ఎస్ఐగా షేక్ మహమ్మద్ సుభాని గురువారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు బాలాజీ నగర్ ఎస్ఐగా పనిచేస్తున్న మహమ్మద్ సుబాని బదిలీపై ఇక్కడ నియమితులయ్యారు. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టారు ఆయన మాట్లా డుతూ మండలంలో శాంతిభద్రతలను పరిరక్షిం చడంతోపాటు అసాంఘిక కార్యక్ర మాలకు చోటులేకుండా బాధ్యతా యుతంగా విధులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. లింగసముద్రం ఎస్ఐగా పనిచేస్తున్న బాజీ బాబును నెల్లూరుకు బదిలీ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి - వెంకటాచలం : మండలంలోని గొలగమూడి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం పరి శీలించారు. అనంతరం ఆయన అధికారులతో కలసి కేంద్రంలో పిల్లలకు, గర్భిణులకు అందుతున్న పోషకాహారం సరఫరాపై లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు.అనంతరం ఆయన స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. సూపర్వైజర్ బి.పద్మజ, సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ ఏం.మస్తాన్ బాబు,గీత, తదితర సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం ధరలపై అధికారులు ఆరా..!

తోటపల్లిగూడూరు : రైతులు పండించిన ధాన్యం ధరలపై వ్యవసాయ శాఖ అధికారులు గురువారం ఆరా దిశారు. గురువారం వ్యవసాయ సహాయ సంచాలకులు (ఎడిఎ) రాజ్ కుమార్, మండల వ్యవసాయాధికారి వివి శిరీష రాణి,ఎఇఒ హరిబాబు మండలంలోని పేడూరు గ్రామంలో పర్యటించారు. ఎడిఎ రాజ్ కుమార్ రైతు గూడూరు శ్రీహరిణి ధాన్యం ధరల గురించి అడిగి తెలుసుకున్నారు.

హెల్త్ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు : సంతపేట ప్రైవేట్ భవన్‌లో గురువారం ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ లో భాగంగా ఆంధ్రప్రదేశ్ హెల్త్ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎపి హంస జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్ రావు ప్రకటించారు. జిల్లా అధ్యక్షులుగా నున్నా. హరిప్రసాద్, జిల్లా జనరల్ సెక్రెటరీగా బట్టేపాటి అశోక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన వెల్లడించారు.

మంత్రులను కలిసిన ఎంఎల్‌ఎ 'ఇంటూరి'

ప్రజాశక్తి- కందుకూరు : విజయవాడలో రాష్ట్ర పశుసంవర్ధక ,పాడిపరిశ్రమ అభివద్ధి శాఖ మంత్రి కింజరాపు అచ్చన్నా యుడు, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌లను ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు గురు వారం మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి కె.అచ్చన్నా యుడుతో చినలాటిరిపి గ్రామం వద్ద మంజూరైన హార్టికల్చర్ యూని వర్సిటీకి నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఎల్ఐసి ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు యల్ఐసి బ్రాంచి కార్యాలయం వద్ద ఏజెంట్లు ధర్నా చేశారు. ఏజెంట్లను ప్రభావితం చేసే బీమాసుగం, భౌమావిస్తార్, భీమావాహన్,భీమాత్రినిటి ,భీమావిట్రాన్, భీమసమర్థలను అమలు చేయవద్దని, జిఎస్‌టి రద్దు, ఆదాయపన్ను మినహాయింపు పాలసీదారుల కోరిక అని నినదించారు. ఎఫ్‌డిఐ వాటా74శాతం నుండి 100 శాతానికి పెంచొద్దని డిమాండ్ చేశారు. నెల్లూరు డివిజన్ అధ్యక్షులు బెజవాడ శివయ్య, వరప్రసాదు, మధు,సుబ్బారావు,చీదెళ్ళ పిచ్చయ్య, రాజేశ్వరాచారి, ప్రభాకర్,మల్లికార్జున రెడ్డి,పాలయ్య, శంకర్ పాల్గొన్నారు.

ఎస్ఐ మహేంద్రనాయక్‌ను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు రూరల్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన మహేంద్ర నాయక్ ను గురువారం మాచవరం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు సూరం చిరంజీవి రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ మధ్యకా లంలో మాచవరం కొండమీద జరిగిన చోరీ కేసులో దొంగలను అరెస్టు చేయాలని ఎస్ఐ మహేంద్ర నాయక్‌ను కోరారు. శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేట్ ఉద్యోగాలకు 'ప్రకాశం' విద్యార్థులు ఎంపిక



ప్రజాశక్తి-కందుకూరు : ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో ఉద్యోగాల కల్పనలో మరోసారి బ్రాండ్ అంబాసిడర్ గా నిలిచిందని టెక్నికల్ డైరెక్టరు, తాజా మాజీ హెచ్.సి.ఎల్ టెక్నికల్ మేనేజరు డాక్టర్ కంచర్ల విజయ శ్రీనివాస్ వెల్లడించారు. బుధ, గురు వారాల్లో కాలేజీలో ఆల్ సెక్ (బెంగళూరు) పిఎన్‌కె కనస్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో 77 మందికి ఉద్యోగ పత్రాలు దక్కాయన్నారు. ఆల్ సెక్ కు ఎంపికైన 67 మందికి వార్షిక వేతనం 2.2 లక్షలని ఆయన తెలిపారు.పిఎన్‌కె కనస్ట్రక్షన్స్ కు ఎంపికైన పదిమందికి 1.8 లక్షల వార్షిక వేతనంతో పాటు వసతి, భోజన సదుపాయం కల్పిస్తారన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ అరుణమ్మ

ప్రజాశక్తి-నెల్లూరు : గ్రామాల్లో రోడ్లు, కల్వర్టులు, ఉపాధిహామీ పనులు, మంచినీటి సరఫరా, జిల్లా గహనిర్మాణశాఖలకు సంబంధించి సభ్యులు కోరిన పనులను వెంటనే పూర్తి చేయాలని ఆయాశాఖల అధికారులకు జిల్లా పరిషత్తు చైర్మన్ ఆనం అరుణమ్మ సూచించారు. గురువారం జడ్‌పి కార్యాలయంలో జిల్లా ప్రజాపరిషత్ స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. ఆమె ముందుగా మొదటి, ఏడు స్థాయి సంఘంలో ఆర్అండ్‌బి, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, డ్వామా శాఖలు, 2, 3వ స్థాయి సంఘంలో జిల్లా గహనిర్మాణ శాఖ, విద్యుత్‌శాఖ, జిల్లా పశుసంవర్ధకశాఖ, జిల్లా మత్స్యశాఖ, జిల్లా ఉద్యానవనశాఖలు, 4వ స్థాయి సంఘంలో విద్య, వైద్యారోగ్యశాఖలు, 5వస్థాయి సంఘంలో ఐసిడిఎస్, 6వ స్థాయి సంఘంలో ఐటిడిఎ, సాంఘిక సంక్షేమశాఖలకు సంబంధించిన అంశాలపై సమావేశాలు నిర్వహించారు. అనంతరం పలువురు సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు అధ్వాన్నంగా వున్నాయని, ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు జరుగుతు న్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. డ్వామా పీడీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధిహామీ పనులు ఎక్కువగా చేపట్టేందుకు చర్యలు చేపట్టామని, గ్రామాల్లో గుర్తించిన పనులను చేపడుతున్నట్లు చెప్పారు. జెడ్‌పి సిఇవో కన్నమనాయుడు మాట్లాడుతూ మండల సమా వేశాలకు మండల, డివిజన్ స్థాయి అధికారులకు తప్పకుండా హాజరుకావాలని, లేకపోతే క్రమశిక్షణా చర్యలు తీసుకునేలా ఆయాశాఖల ఉన్నతా ధికారుల దష్టికి తీసుకెళ్తామన్నారు. సూళ్లూరుపేట ఎంఎల్‌ఎగా ఎన్నికై తొలిసారిగా ఉమ్మడి నెల్లూరుజిల్లా స్థాయి సంఘ సమావేశాలకు విచ్చేసిన నెలవల విజయశ్రీని జడ్పీ చ్కెర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సభ్యులు, అధికారులు ఘనంగా సత్కరించారు. ఎంఎల్‌సి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, జెడ్‌పి సిఇఒ కన్నమనాయుడు, డిప్యూటీ సిఇవో చిరంజీవి, డ్వామా పీడీ శ్రీనివాసులు, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ విజయన్, హౌసింగ్ ఈఈలు మాధవరావు, మోహన్‌రావు, మత్స్యశాఖ జెడి నాగేశ్వరావు, పశుసంవర్ధకశాఖ జెడి కోటేశ్వరావు, ఆర్అండ్‌బి డిప్యూటీ ఎస్‌ఇ సురేష్, జిల్లా ఉద్యనవనశాఖ అధికారి సుబ్బారెడ్డి ఉన్నారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని రామలింగాపురం అండర్ బ్రిడ్జి సమీపంలో ఈ నెల 25న హత్యకు గురైన రౌడీ షీటర్ గుంజి రవి, అలియాస్ కత్తి రవి కేసుకు సంబంధించి లక్ష్మి శెట్టి సాయి తేజ, వాడేపల్లి వెంకటేష్, అరవభూమి సుజన్ క్రిష్ణ, కాసారం వంశీ కృష్ణ, తమ్మిరెడ్డి పవన్‌కుమార్, మల్లి నారాయణ తదితరు ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారని నగర డిఎస్‌పి డి.శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. గురువారం బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. హత్యకు గురైన గుంజి రవి, నిందితులుగా పోలీసులు అరెస్టు చేసిన ఆరుగురు యువకులు అందరూ స్నేహితులే. వారంతా నేరచరిత్ర కలిగి ఉన్నారు. జిల్లాలో చోటు చేసుకున్న పలు నేరాల్లో వీరి పాత్ర ఉంది. ఆ క్రమంలో ఇప్పటికే పలు మార్లు జైలు జీవితం గడిపారు. మద్యం మత్తులో హత్యకు గురైన గుంజి రవి, అరవభూమి సుజన్ క్రిష్ణలకు సెల్‌ఫోన్ సంభాషణలో మాటా మాటా పెరిగి క్రమంలో, ఇతర వ్యవహారాల్లో చోటు చేసుకున్న మనస్పర్ధల కారణంగా పథకం ప్రకారం ఈ ఘటన చోటు చేసుకుంది. రామలింగాపురం ప్రాంతంలోని బిరియాని షాపు సమీపంలో ఉన్న గుంజి రవిని బైకులపై వచ్చిన నిందితులు కత్తులతో విచక్షణా రహితంగా దాడికి పాల్పడటంతో ఘటన స్థలం వద్దనే మృతి చెందాడు. ఈ హత్య సమాచారం తెలుసుకున్న ఎస్‌పి జి.కృష్ణకాంత్ సూచనల మేరకు నగర డిఎస్‌పి డి.శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షణలో బాలాజీనగర్ పోలీసు స్టేషన్ సిఐ సాంబశివరావు, సిబ్బంది బృందంగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఘటనా స్థలం వద్ద, చుట్టు ప్రక్కల ఉన్న సిసి కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి గొలగమూడి క్రాస్ రోడ్డు ప్రాంతంలో ఉన్న నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్నారు. నిందితులు హత్యకు పాల్పడిన సమయంలో వినియోగించిన రెండు బైకులు, నాలుగు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విచారణలో అత్యంత ప్రతిభను కనపరిచి, త్వరతిగతిన నిందితులను అదుపులోకి తీసుకొనేందుకు కృషి చేసిన సిబ్బందిని ఎస్‌పి అభినందించారని డిఎస్‌పి శ్రీనివాసులురెడ్డి వెల్లడించారు.

తెలుగు భాషకు 'గిడుగు' ఎనలేని కృషి : కలెక్టర్



నెల్లూరులో..

నెల్లూరు : తెలుగును వాడుక భాషగా తీసుకురావడానికి గిడుగు వెంకటరామమూర్తి చేసిన కృషి శ్లాఘీనయమని కలెక్టర్ ఒ.ఆనంద్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో గిడుగు వెంకటరామమూర్తి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలుగుభాషకు గిడుగు వెంకటరామమూర్తి చేసిన సేవలను స్మరించ ుకుంటూ ఆయన జయంతిని తెలుగుభాషా దినోత్సవంగా జరుపు కుంటున్నట్లు కలెక్టర్ చెప్పారు. తొలుత గిడుగు చిత్రపటానికి కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్‌వో లవన్న తదితరులు పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు.పలు శాఖల్లో గిడుగు చిత్రపటానికి నివాళి అర్పించారు.

మాతృభాషతోనే ఉన్నత శిఖరాలు

మాతభాషలో విద్యానభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరవచ్చని సంఘమిత్ర హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సుచిత్ర అన్నారు. గురువారం జిల్లా రచయితల సంఘం సంఘమిత్ర పాఠశాలలో ఏర్పాటుచేసిన తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ రష్యా జపాన్ జర్మనీ మొదలగు దేశాల్లో మాతృభాషలోనే నే విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకున్నారని నోబుల్ అవార్డు కూడా సాధించారని ఆమె అన్నారు.

స్వచ్ఛమైన తెలుగు భాషా



కొండాయపాళెం లోని నగర పాలక ప్రాథమిక పాఠశాల లో గురువారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. గిడుగు వెంకట రామ మూర్తి చిత్ర పటానికి నివాళు లు అర్పించారు. హెచ్ఎం ఎం భాస్కరరావు తెలుగు భాషకు 'గిడుగు' చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులకు పద్యాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు హరీష్ కిరణ్ వాలంటీర్ రాశి విద్యార్థులు పాల్గొన్నారు

ఒవెల్ స్కూల్లో.. అన్నమయ్య సర్కిల్ శ్రీనగర్ కాలనీలో ఒవెల్ ఐ.సి.ఒ పాఠశాలలో తెలుగు భాష దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో పాఠశాల ప్రధానో పాధ్యాయులు యు.రమణ నాయుడు మాట్లాడారు. ముఖ్య అతిథిగా ఓవెల్ స్కూల్స్ చైర్మన్ ఆర్ వేణు పాల్గొన్నారు. సిఇఒ ప్రమీల, జియం. మహదేవయ్య ఉన్నారు.

ఓవెల్ మోడల్ పాఠశాలలో..నెల్లూరు నగరంలోని 11వ డివిజన్ సరస్వతి నగర్ ప్రాంతంలో ఉన్న ఓవెల్ మోడల్ పాఠశాలలో గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకొని ఈనెల 22వ తేదీ నుంచి 27వ తేదీ వరకు వివిధ పోటీలు నిర్వహించారు. గురువారం గిడుగు జయంతిని పురస్కరించుకుని విజేతలకు బహుమతులు అందజేశారు. ఓవెల్ పాఠశాలల చైర్మన్ ఆర్ వేణు, సీ.ఈ.ఓ.ఆర్. ప్రమీల మాట్లాడారు.

అవెన్యూస్‌లో.. నెల్లూరు ప్రశాంతి నగర్ బ్రహ్మ నందపురంలోని అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్లో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా జరిగింది ముఖ్య అతిథులుగా బుచ్చిరెడ్డిపాలెం సిఐ పి శ్రీనివాసరెడ్డి, తెలుగు భాషాభిమాని శ్రీ పేరి చెట్ల శివకుమార్ హాజరై మాట్లాడారు. స్కూల్ కరస్పాండెంట్ పెనుబల్లి కష్ణ చైతన్య మాట్లాడారు.

తోటపల్లిగూడూరు : కోడూరు పంచాయతీ చెన్న పల్లెపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగు భాష దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడల దినోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన వేడుకలు అంబరాన్నంటాయి. ప్రధానో పాధ్యాయులు సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తె లుగు భాషా దినోత్సవం, హా కీ క్రీడాకారుడు ధ్యాన్చంద్ జయంతి సందర్భంగా క్రీడల పోటీలు, ప ద్య రచన పోటీలు, వేమన పద్య పో టీలు, తెలుగు కవుల వేషధారణ పో టీలు,వకత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు నాగరాజు, నిర్మల, వాణి, జై భారతి, చంద్రమౌళి, ఫణికు మార్, మోహన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం,క్రీడాదినోత్సవం గురువారం నిర్వహించారు. వ్యవహారిక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వేంకట రామమూర్తి, సేవలగురించి తెలుగు భాష ఉపాధ్యాయులు తల్లపనేని శ్రీనివాసరావు,గుడ్లూరు వెంకన్న కవి, సిహెచ్ వెంకటేశ్వర్లు,ప్రధానోపాధ్యాయులు యం.నరసింహమూర్తి ప్రసగించారు.విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

టిఆర్‌ఆర్‌లో.. కందుకూరు తిక్కవరపు రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మాతృభాషా దినోత్సవం సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తి , జాతీయక్రీడా దినోత్సవం మేజర్ ధ్యాన్‌ఛద్ జయంతి వేడుకలు జరిగాయి. కళాశాల ప్రిన్సిపల్ ఓరుగంటి వెంకటేశ్వరరావు తెలుగు భాషా దినోత్సవం గిడుగు రామ్మూర్తి జన్మదిన గురించి విద్యార్థులకు వివరించారు.

ఉలవపాడు : ఉలవపాడు జీ.వీ.ఎస్. ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో గురువారం నాడు తెలుగు భాషా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి లక్ష్మి సుధారాణి అధ్యక్షతన జరిగింది.



కందుకూరులో..

నేడు జువ్వలదిన్నె హార్బర్ ప్రారంభం


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ క్రిష్ణారెడ్డి

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం జువ్వలదిన్నెలో నిర్మించిన ఫిషింగ్ హార్బర్ శుక్రవారం ప్రారంభం కానుందని ఎంఎల్‌ఎ కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను వర్చువల్ విధానంలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారని తెలిపారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా హార్బర్ ప్రారంభం కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేరుగా ప్రారంభోత్సవం కానుండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా హార్బర్ నిర్మించడంతో ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబును బుధవారం కలిసి హార్బర్‌కు రావాల్సిందిగా ఆహ్వానించినట్లు, త్వరలో హార్బర్‌ను వచ్చి పరిశీలిస్తామని చంద్రబాబు చెప్పారని తెలిపారు. శాస్త్రీయ సాంకేతికతతో హార్బర్ నిర్మాణం జరిగిందని తెలిపారు. ఎన్నోయేళ్లుగా మత్స్యకారుల కల నెరవేరనుందని, హార్బర్ వల్ల మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు వస్తాయని తెలిపారు. 2018లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్న సమయంలో శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. కావలి నియోజకవర్గ అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి చేస్తానని తెలిపారు.

పలుచోట్ల జాతీయ క్రీడా దినోత్సవం

ప్రజాశక్తి-కావలి : శ్రీ పొట్టిశ్రీరాములు పురపాలక ఉన్నత పాఠశాలలో గురువారం "జాతీయ క్రీడా దినోత్సవం" సందర్భంగా ఎన్.సి.సి. 10వ ఆంధ్ర నావెల్ యూనిట్ నెల్లూరు కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కమాండర్ బాలాజీ గోదండే ఆదేశాల ప్రకారం రన్ ఫర్ ఫిట్ కార్యక్రమంలో భాగంగా 2కె రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారిన ఈనాటి జీవన శైలికి నడక లేదా రన్ చాలా అవసరం అని తెలిపారు. ఎన్.సి.సి. కాడెట్స్ పాఠశాల నుండి 6 రోడ్ల కూడలి, ఎం.ఎస్.ఆర్ బొమ్మ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎన్.సి.ఐ. గోడౌన్ మీదుగా 2కె రన్ చేశారు. ఈ కార్యక్రమం మొత్తం ఎన్.సి.సి. ఆఫీసర్ తిప్పిరెడ్డి కొండారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జీవశాస్త్ర అధ్యాపకులు కె.ఎస్.కె.అంజాద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నెల్లూరు : 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ అండ్ కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గోదండే ఆదేశాల మేరకు నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా రన్ ఫర్ ఫిట్నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విబిసనగర్‌లోని కురుగంటి నాగిరెడ్డి నగరపాలక ఉన్నత పాఠశాల నుండి ఆనం వెంకట సుబ్బారెడ్డి స్టేడియం వరకు రన్ ఫర్ ఫిట్నెస్ ర్యాలీ పండెం అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ గుండాల నరేంద్ర బాబు, సి. వి నాగరాజు ఆధ్వర్యంలో చేపట్టారు.

ప్రజాశక్తి-కావలి : నెల్లూరు పట్టణ నివాసులు కె.శ్రీనివాసరావు - లలిత దంపతుల సహకారంతో సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో కావలి పట్టణం బాపూజీ నగర్లో ఉన్న బిసి హాస్టల్ విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, రన్నింగ్ రేస్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు విశ్వోదయ బాలికల పాఠశాల ఆవరణలో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ ఆక్వా వ్యాపారవేత్త వేలూరు జయచంద్రనాయుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బుర్రా.రఘుకుమార్ రెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్ సెక్రటరీ గంధం ప్రసన్నాంజనేయులు, విశ్రాంత బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ ఎం.చంద్రశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ మాధవి, పి.ఇ.టీచర్ రాజ్యలక్ష్మి, బిసి హాస్టల్ వార్డెన్ నాగేశ్వరి, సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగం : స్థానిక జెడ్‌పి హైస్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఎన్‌సిసి అధ్వర్యంలో ఉపాధ్యాయులు లక్ష్మీ నారాయణ ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుండి ప్రధాన వీధులలో విద్యార్థులు ఫ్లకార్డులు చేతపట్టి వారు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతీరోజు నడక ఆరోగ్యానికి ప్రతీక అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని పోలిరెడ్డి పల్లి ఉన్నత పాఠశాలను సందర్శించిన ఎంఇఒ-2 ధనలక్ష్మి విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం చేసిన వంటలు రుచికరంగా ఉన్నాయా.. లేదా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగున్నాయని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు హరికృష్ణ ఉన్నారు.

ఇసుక రీచ్‌లో తనిఖీలు

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని పడమటి ఖమ్మంపాడు గ్రామంలోని ఎసిబి డిఎస్‌పి శిరీష ఆదేశాల మేరకు ఇసుక రీచ్‌లో ఎసిబి అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 2021 నుంచి ఇసుక రీచ్‌లో జరిగిన త్రవ్వకాలు వివరాలను గ్రామ రెవెన్యూ అధికారులు ఉదయగిరి ప్రభాకర్, నాగేంద్రను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామానికి వెళ్లి ప్రజల వద్ద వివరాలను సేకరించారు.

బి.సి.జి. టీకాలు పరిశీలన



ప్రజాశక్తి-ఉదయగిరి : కొండాయపాలెం, ఉదయగిరి సచివాలయ పరిధిలోని మాసాయిపేట, గంగిరెడ్డిపల్లి, ఉదయగిరి, బాలాజీనగర్, నిర్వహి స్తున్న అడల్ట్ బి.సి.జి. టీకాల కార్యక్రమాన్ని గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విద్యా బోధకులు కలసపాటి. వెంకటసుబ్బయ్య పరిశీలించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు చెన్నయ్య, టి.బి. పర్యవేక్షకులు బోగ్యం వెంకటేశ్వర్లు, ఆరోగ్య కార్యకర్తలు కండెల.శ్రీనివాసులు, ఎఎన్ఎంలు నూర్జహాన్, సుప్రజ, విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు రేణుక, రామ తులసి, లక్ష్మి, అంకమ్మ పాల్గొన్నారు.

సొంత నిధులతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-బిట్రగుంట : విశ్వనాథరావు పేట పంచాయతీ కొత్తూరు స్థానికుడు నెల్లూరు శివకృష్ణారెడ్డి సొంత నిధులతో గ్రామంలోని స్వచ్ఛంద సేవా కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. రానున్న వర్షాకాలాని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడకుండా పాఠశాల ఆవరణలో ఉన్న గోవులను మట్టి పోసి పూడ్చారు. అలాగే బృందావన వీధి, జెండా వీధిలో రోడ్డు దెబ్బ తిని గోతులు ఏర్పడి ఉన్న వాటిని మరమ్మతులు చేయడంతో గ్రామస్తులు శివకృష్ణారెడ్డి అభినందించారు. గ్రామాభివృద్ధికి యువత ముందుకు రావాలన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



ప్రజాశక్తి-కావలి : పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ కంకణ బద్ధులు కావాలని, ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతితో కలిసి జీవించడం ద్వారానే మనిషి మనుగడ సరైన మార్గంలో ముందుకు సాగుతుందని జిడి నాయుడు ప్రయివేట్ ఐటిఐ కరస్పాండెంట్ నరహరి ఆదినారాయణ రావు (బాబీ) అన్నారు. గురువారం పట్టణంలోని ముసునూరులో జిడి నాయుడు ప్రయివేటు ఐటిఐ కళాశాల ఎపిజె అబ్దుల్ కలాం బ్లాక్ ప్రాంగణంలో ది పూర్ పీపుల్స్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర్ చేవూరు చిన్న ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నరహరి ఆదినారాయణరావు (బాబీ), ది పూర్ పీపుల్స్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు చేవూరు చిన్న, ఐటిఐ ప్రిన్సిపాల్ యర్రబోతు వెంకటేశ్వర రావు మాట్లాడుతూ పరిశుభ్రత, పచ్చదనంతో కూడిన ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతిఒక్కరూ పునరంకితం కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు మద్దిబోయిన శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీలు



ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సర్వరాబాద్ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి-2 తోట శ్రీనివాసులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురువారం విద్యాశాఖ అధికారి పాఠశాలలోని అన్ని తరగతుల విద్యార్థుల పఠన అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తూ విద్యార్థులు చతుర్విధ ప్రక్రియలలో సామర్థ్యాలు వారి తరగతి స్థాయి కంటే ఉన్నతంగా ఉండడంపై ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనాన్ని పరిశీలిస్తూ శుభ్ దిన్ భోజన్‌లో భాగంగా విద్యార్థులకు అరటి పండ్లు, స్వీట్స్, చికెన్ కూర అందించిన దారపునేని కేశవ నారాయణ కుమారుడు, చంద్ర పవనేష్ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులందరికీ శుభ్ దిన్ భోజన అందించిన డి.కేశవ నారాయణను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ముజఫర్ అలీ పాల్గొన్నారు.

దగదర్తిని అభివృద్ధి చేస్తా..



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ క్రిష్ణారెడ్డి

ప్రజాశక్తి-దగదర్తి

మండలంలో ఇప్పటివరకు జరిగిన తనకు అనవసరమని, ఇకపై దగదర్తి మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకునేందుకు అధికారులు అలసత్వం వీడి సహకరించాలని ఎంఎల్‌ఎ దగుమాటి వెంకటకృష్ణారెడ్డి హితవు పలికారు. గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో ఎంపిపి తాళ్ళూరు వెంకటకృష్ణ ప్రసాద్ నాయుడు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంఎల్‌ఎ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో దగదర్తి మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకునేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్న లక్ష్యంతో ప్రతిఒక్కరూ పని చేయాలన్నారు. అందుకోసం తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని ఎంఎల్‌ఎ భరోసా ఇచ్చారు. విధులపై అలసత్వం వహించే అధికారులపై మాత్రం తాను కఠినంగానే వ్యవహరిస్తానని సున్నిత హెచ్చరికలు చేశారు. అనంతరం మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట టిడిపి కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. దగదర్తి నుంచి బుచ్చికి రోడ్డు సరిగ్గాలేక ప్రయాణించాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పరిస్థితి అధ్వాన్నమైందన్నారు. గతంలో రోడ్డు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పనులు నిలిపివేయడంతో మళ్లీ కాంట్రాక్టర్‌ను పిలిపించి రోడ్డును పనుల్లో ప్రారంభించాలని సూచించినట్లు తెలిపారు. ఈ రోడ్డు కూడా త్వరలో కల్లా పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దగదర్తిలోని దామవరంలో విమానాశ్రయం కోసం సేకరించిన భూమిలో ఇన్ని ఆటంకాలు వచ్చినా తొలగించి విమానాశ్రయాన్ని ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు. గత ఐదు సంవత్సరాల నుంచి కావలి నుంచి తుమ్మలపెంట పోయేందుకు రోడ్డు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, 1వ తేదీన రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్ శ్రీదేవి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ సిహెచ్ గోపీకృష్ణ, ఇఒపిఆర్‌డి జి.గోపి శ్రీనివాస్, కావలి మున్సిపల్ మాజీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, టిడిపి నాయకులు నాయుడు రాంప్రసాద్, పంచాయతీరాజ్ ఎఇ డి.భాస్కర్, ఎసిఎ జంపాని కుమార్, బలవ నాయకులు సిద్దు, కె.మధుబాబు నాయుడు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

'చెకుముకి' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి-కావలి

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ప్రముఖ వైద్యులు డాక్టర్ బెజవాడ. రవికుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని రవిన్‌ర్సింగ్ హోమ్‌లో జెవివి పట్టణ కార్యవర్గ సమావేశాన్ని అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సెప్టెంబర్ 25వ తేదీన పాఠశాల స్థాయి, అక్టోబర్ 1వ తేదీన మండల, పట్టణస్థాయి, అక్టోబర్ 27వ తేదీన జిల్లాస్థాయి, నవంబర్ 9, 10 తేదీల్లో రాష్ట్రస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ (సైన్స్ సంబరాలు) నిర్వహిస్తున్నట్లు, 8, 9, 10 తరగతుల విద్యార్థులందరూ పాల్గొనాలని తెలియజేశారు. అదేవిధంగా టాలెంట్ టెస్ట్ తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ఉంటుందని తెలియజేస్తూ కావలి పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేట్ స్కూల్ యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులందరూ విద్యార్థులను ప్రోత్సహించాల్సిందిగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోశాధికారి టి.సుబ్బారామిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.కళ్యాణి, ఉపాధ్యక్షులు కె.హరి నారాయణరెడ్డి, సి.కష్టయ్య, సంయుక్త కార్యదర్శులు సి.హెచ్.శారద, గాదిరెడ్డి.మురళీకృష్ణ, కార్యవర్గ సభ్యులు ఎస్.కె.జమీర్, రెడ్‌క్రాస్ బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా ఉంచాలి



ప్రజాశక్తి-ఉదయగిరి : ప్రాజెక్టు పరిధిలోని అన్ని సెక్టర్ కేంద్రాలలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని రకాల రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని సిడిపిఒ పచ్చవ లావణ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ప్రాజెక్టు పరిధిలోని పరకుంటపాడు ఉదయగిరిలోని 1, 3 సెక్టార్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సెప్టెంబర్ నుంచి జరిగే పోషకాహార మాసోత్సవాలు జయప్రదం చేయాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా అందించాలన్నారు. లేనిపక్షంలో కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్రాల నిర్వహణలో సమయపాలన పాటించి, రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం సూచించిన నిబంధనలు మేరకే పోషకాహార మాసోత్సవాలను నిర్వహించాలని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు తేజస్విని, షాను, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

పిఎంఎవై పథకంలో ఇళ్ళు మంజూరైన లబ్ధిదారులందరూ మార్చి 2025లోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకునేందుకు ముందుకు రావాలని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. గురువారం ఉదయం బుచ్చిరెడ్డిపాలెం అర్బన్ పరిధిలోని కట్టుబడిపాలెం హౌసింగ్ లేఅవుట్‌ను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గృహనిర్మాణ లబ్ధిదారులతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఇళ్లు పూర్తి చేసుకోవాలని వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 2025 నాటికి 100రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించి జిల్లాలో 5378 ఇళ్లను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 2025 మార్చి తరువాత ఈ పిఎంఎవై 1.0 హౌసింగ్ స్కీం పూర్తవుతుందని, ఈలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రావాలని సూచించారు. హౌసింగ్ బిల్లులు కూడా సకాలంలో మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ లబ్ధిదారులకు వివరించారు. హౌసింగ్ లేఅవుట్లో విద్యుత్, మంచినీటి సౌకర్యాలు కల్పించాలని, లబ్ధిదారులకు మెప్మా ద్వారా రుణాలు మంజూరు చేయించాలని అధికారులను సూచించారు. కలెక్టర్‌వెంట హౌసింగ్ పిడి దయాకర్, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, డిఇ వెంకటేశ్వర్లు, ఎఇ పెంచలయ్య పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-నెల్లూరు

కలకత్తాలోని ఆర్‌జికర్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో పీజీ రెండో సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థినిని అత్యంత దారుణంగా హింసించి, అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన నేరస్తులను కఠినంగా శిక్షించాలని స్త్రీ విముక్తి సంఘటన డిమాండ్ చేసింది. గురువారం నగరంలో భారీ స్థాయిలో ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 36 గంటలు పాటు డ్యూటీ చేసి, విశ్రాంతి కోసం వెళ్లిన ఆమెపై హాస్పిటల్ ఆవరణంలోని సెమినార్ హాల్లోనే ఈ ఘోరమైన దురాగతానికి పాల్పడ్డారంటే మహిళల భద్రత ఎంత ప్రశ్నార్థకం ఉందో అర్థమవుతుం దన్నారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.సునీత, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి పి.కొండమ్మ మాట్లాడారు.

ఎస్‌పిని కలిసిన చెంచలబాబు యాదవ్



ప్రజాశక్తి-ఉదయగిరి : ఎస్‌పిగా నూతన బాధ్యత స్వీకరించిన కృష్ణకాంత్‌ను మర్యాదపూర్వకంగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాజీ జెడ్‌పి చైర్మన్ పి.చెంచలబాబు యాదవ్ కలిశారు. గురువారం నెల్లూరులోని పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా ప్రస్తుత రాజకీయాల గురించి చర్చించారు. ఆయనవెంట దుత్తలూరు మాజీ ఎంపిపి శ్రీకృతి, రవీంద్రబాబు పాల్గొన్నారు.

పనులు పరిశీలన


పనులు పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని సోమశిల ప్రాజెక్టులో జరుగుతున్న ఆప్రాన్ పనులను సోమశిల ప్రాజెక్టు ఎస్ఇ వెంకట రమణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆప్రాన్ పనులు వేగవంతంగా చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం పరమానంద ఆశ్రమం వద్ద కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించి ఆర్‌అండ్‌బి అధికారులతో చర్చించారు. కండలేరు వరద కాలువను పరిశీలించి లీకేజీ అవుతున్న ప్రాంతాలను గుర్తించారు. కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బొమ్మిరెడ్డి దశరధరామిరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీంద్ర ప్రసాద్, జేఈలు నిఖిల్, రామ్మోహన్ రెడ్డి, సాయికృష్ణ, కన్‌స్ట్రక్షన్ మేనేజర్ మోహన్‌రెడ్డి, ప్రాజెక్టు సిబ్బంది ఉప్పలపాటి రామయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

ప్రజాశక్తి-మర్రిపాడు

కర్నాటక - ఆంధ్ర సరిహద్దు పాళ్య గేటు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మండలంలోని చుంచులూరు గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. మృతులు చుంచులూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు, భార్య పుష్ప, కుమారుడు శ్రీకాంత్ వివాహానికి వెళ్లి సొంత గ్రామానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న టెంపో కారును ఢీకొట్టడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. దాంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


ప్లెడ్జ్ నిర్వహిస్తున్న తపాలా సిబ్బంది

తపాలా ఆధ్వర్యంలో ఆటలపోటీలు

ప్రజాశక్తి-కావలి

కావలి ప్రధాన తపాలా కార్యాలయంలో "నేషనల్ స్పోర్ట్స్ డే" సందర్భంగా హెడ్ పోస్ట్‌మాస్టర్ ఎ.వి.కృష్ణయ్య ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వివిధ ఆటల పోటీలలో తపాలా సిబ్బంది ఉత్సాహం పాల్గొన్నారు. ఈ సందర్భంగా షటిల్ కాక్, లెమన్ అండ్ స్పూన్, క్యారమ్స్, చెస్, మ్యూజికల్ చైర్స్ మొదలగు ఆటల పోటీలు నిర్వహించారు. తర్వాత ఉద్యోగులందరూ ఫిట్‌నెస్ ప్లెడ్జ్‌లో విరివిగా పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్‌లు గుర్తింపు

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం కప్పరాలు తిప్ప జాతీయ రహదారి ఆనుకొని ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన లే అవుట్‌కు ఎటువంటి అనుమతులు లేవని ప్రభుత్వం ఈ లేఅవుట్‌ను అనధికార లేఅవుట్‌గా గుర్తించినట్లు బోగోలు పంచాయతీ కార్యదర్శి ప్రకటనలో తెలిపారు. బోగోలు పంచాయతీ సర్వే నెంబర్ 4/1-1, 572-1లోని ప్లాట్‌లను అమ్మినా.. కొన్నా.. చట్టరీత్యా చర్యలు తప్పవని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అధికారులు లేవట్ వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా లేఅవుట్‌లను వేశారని ఇలాంటి లేఅవుట్‌లలో ప్రజలు కొనుగోలులు అమ్మకాలు చేయొద్దన్నారు.

తెలుగుభాషా దినోత్సవ వేడుకలు



మర్రిపాడులో...

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని పోలిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా, తెలుగుభాషా దినోత్సవం వేడుకలను స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీషు) ఉమామహేశ్వర రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్కౌట్ అండ్ గైడ్స్ కార్యక్రమాన్ని ఎంఇఒ-2 ధనలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ముందుగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి తెలుగు తీయ్యదనాన్ని సామాన్యుడికి చేరువ చేసేందుకు ఆయన ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నరసింహా రావుఉపాధ్యాయులు విజయ్ కుమార్, సుజాత, మస్తాన్‌ఖాన్, జయ రామయ్య, రషీద్, ఖాదర్ ఉన్నీసా, గ్రామస్తులు ఓబుల్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంఇఒ కార్యాలయంలో గిడుగు వెంకటరామ్మూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంఇఒలు బి.గోవిందయ్య, సిహెచ్.వెంకట సుబ్బయ్యలు ఆయన చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పిస్తూ, వారు చేసిన గొప్పతనాన్ని గురించి సభలో మాట్లాడారు. కార్యక్రమంలో అనేకమంది హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులు, సిఆర్‌ఎంటిలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : పట్టణంలోని సెయింట్ మేరీస్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో మాతృభాష దినోత్సవాన్ని ప్రిన్సిపల్ ఝాన్సీ రాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కరస్పాండెంట్ ఫాతిమా మేరీ విచ్చేశారు. విద్యార్థినీ విద్యార్థులకు పద్య పఠన పోటీలు వ్యాసరచన పోటీలు చర్చావేదిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన వారికి బహుమతులు ప్రదానం ప్రిన్సిపల్ అందజేశారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు ఒంటేరు మల్లికార్జున, గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు గురించి వివరించారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : వ్యావహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి వేడుకలు ఆత్మకూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ మాట్లాడుతూ తెలుగు భాషకు ఆయన చేసిన సేవలను కొనియాడుతూ పేద వర్గాలైన సవర భాషలో విద్య భోధనకు ఎంతోకృషి చేశారన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి కె.శ్రీనివాస రావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : సంగం మండల పరిధిలోని తరుణ వాయి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో తెలుగు భాషా దినోత్సవ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహించారు.

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : మండలంలోని నరసాపురం గ్రామంలోని జెడ్‌పి హెచ్ స్కూల్ ప్లస్‌లో గురువారం జాతీయ క్రీడా, భాషాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభావేదికను తోరణాలతో అలంకరించి ముందుగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.నాగేశ్వరరావు, గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి సీనియర్ తెలుగు ఉపాధ్యాయినీ మల్లేశ్వరి పుష్పాలంకరణ చేశారు. అనంతరం నిర్వహించిన క్రీడా పోటీలు గెలుపొందిన విజేతలకు వ్యాయామ ఉపాధ్యాయులు ముజీర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేశ్వరి, కామేశ్వరి, కృష్ణారెడ్డి, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కావలి : జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో గురువారం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుశాఖ అధిపతి పి.నారాయణ అధ్యక్షత వహించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు, డాక్టర్ ఆర్.మాల్యాద్రి, కళాశాల స్టాటిస్టిక్స్ అధ్యాపకుడు టి.వి.రమణ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. తెలుగు అధ్యాపకులు టి.హరికృష్ణ వందన సమర్పణతో సభ ముగిసింది. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని వెంగంపల్లి ఉన్నత పాఠశాలలో తెలుగు భాష ఆవశ్యకత గురించి తెలుగు భారతి సేవాసమితి ఆత్మకూరు వారి ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ప్రతిభా పాఠవపట్ల పరీక్షలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు సోమవరపు సుబ్బ రాయుడు గౌరవాధ్యక్షులు అంకినపల్లి గోవిందరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, గౌరవ సలహాదారు నారాయణరావు, ఉపాధ్యక్షులు యానాద్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-సంగం : స్థానిక జెడ్‌పి హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య ఆధ్వర్యంలో తెలుగు పండితులు తెలుగుభాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గిడుగు వెంకట రామమూర్తి పండితులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు పలు తెలుగు పద్యాలు, శ్లోకాలు పాడారు. తెలుగు ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలుగు భాష గొప్పదనం గూర్చి తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు సబ్బు, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : జిల్లాలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సందీప్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ పి.అశోక్ కుమార్, డేటా సైన్స్ విభాగాధిపతి సాయి ప్రసాద్ రెడ్డి, ఇసిఇ విభాగాధిపతి పెంచలయ్య, ఇఇఇ విభాగాధిపతి టి.రవికుమార్, విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నెల్లూరు : కురుగంటి నాగిరెడ్డి నగరపాలక ఉన్నత పాఠశాల నందు తెలుగు ఉపాధ్యాయుడు గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో గిడుగు వెంకట రామమూర్తి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలను నాటాలి



ప్రజాశక్తి-కావలి : వాతావరణం పూర్తిగా కలుషితంగా మారుతున్న ప్రస్తుత తరుణంలో ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం కావలి రూరల్ మండలం రుద్రకోటలోని ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఎంఎల్‌ఎ పాల్గొన్నారు. కార్యక్రమంలో కావలి ఆర్‌టిఒ సుధాకర్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సుందర రావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, లక్ష్మీబాయి, సిబ్బంది, స్థానిక రుద్రకోట నేతలు పాల్గొన్నారు.

స్థలం పరిశీలన


స్థల పరిశీలన చేపడుతున్న ఆర్‌డిఒ మధులత

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని కృష్ణాపురంలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర స్థలాన్ని గురువారం ఆర్‌డిఒ మధులత పరిశీలించారు. 1వ తేదీన ఉదయం 10గంటలకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆరోగ్య కేంద్రానికి భూమిపూజ చేస్తారన్నారు. ఆసుపత్రి భవన నిర్మాణాలకు రూ.2.65కోట్లతో నిర్మించనున్నట్లు తెలిపారు. ఆమె వెంట తహశీల్దార్ స్వప్న, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర, సర్వేయర్ సుదర్శన్ రెడ్డి, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బ్రహ్మానందరెడ్డి రెడ్డి, విఆర్‌ఒ చిన్నయ్య ఉన్నారు.